క్లుప్తంగా

సక్షన్ ఆపరేటర్లు విరాళం



దాతలను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం వారు రెండు సక్షన్ ఆపరేటర్లను విరాళంగా అందజేశారు. మంగళవారం వీటిని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్‌కు అందించారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, సంఘం నాయకులు బి.కుమారస్వామిరెడ్డి, జి.బాలమద్దయ్య, కేజీ.గోవిందరెడ్డి, రామచంద్రరావు, వై.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఆరోగ్య శాఖ అధికారి విష్ణుమూర్తి

కర్నూలు (టౌన్): నగరపాలక ఆరోగ్య శాఖ అధికారిగా యస్.బి.విష్ణుమూర్తి మంగళవారం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి డెప్యూటేషన్ గడువు రెండుసార్లు ముగియడంతో మాతృసంస్థకు బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు చేపట్టిన విష్ణుమూర్తిని పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటానన్నారు. అంతకుముందు ఆయన నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

స్వచ్ఛాంధ్ర అవార్డు ప్రదానం



మంత్రి టీజీ భరత్ నుంచి సన్మానం పొందుతున్న గిరిజాదేవి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వెల్దుర్తి బీసీ సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం సంక్షేమాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న గిరిజాదేవి 2025 సంవత్సరానికి జిల్లా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకున్నారు. వసతి గృహాన్ని శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ తగు జాగ్రత్తలు తీసుకున్న నేపథ్యంలో ఆమెకు మంత్రి టీజీ భరత్ అవార్డును అందించారు.

జీవాల కొనుగోలుకు సబ్సిడీ ఇవ్వాలి



మంత్రి సవితను సన్మానిస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): గొర్రెలు, మేకల కొనుగోలుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. మంగళవారం ఇక్కడకు వచ్చిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ కలిసి పూలబోకేను అందించి సన్మానించారు. వారు మాట్లాడుతూ.. గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడిన కురువలను ఆర్థికంగా ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ముఖ్యంగా ఉచిత ఇన్సూరెన్స్‌ను అందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చినట్లు సంఘం నేతలు తెలిపారు. నేతలు ధనుంజయ, వెంకటేశ్వర్లు,శ్రీనివాసులు, కేసీ నాగన్న, వెంకటేశ్వర్లు, పుల్లన్న ఉన్నారు.

పని గంటల పెంపును విరమించుకోవాలి



ఆందోళన చేస్తున్న కార్మిక, కర్షక సంఘాలు

కర్నూలు(సెంట్రల్): కార్మికుల పని గంటల పెంపు విధానాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏకంగా 13 గంటల పని విధానాన్ని తీసుకురావడంతో మహిళా కార్మికులు రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వారికి భద్రత ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు. నాయకులు విజయ్, ఆంజనేయులు, నాగన్న పాల్గొన్నారు.



వాల్మీకి జయంతి వేడుకల్లో ఏపీఎస్పీ రెండో పటాలం పోలీసు అధికారులు

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనకు పోరాటం

- త్వరలో అసెంబ్లీ ముట్టడికి పిలుపు
- వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): వాల్మీకుల చిరకాల డిమాండ్ ఎస్టీ రిజర్వేషన్ సాధించే వరకు వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉంటామని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ స్పష్టం చేశారు. మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక జీజీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి వీఆర్‌పీఎస్ నేతలు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. ఎస్టీ రిజర్వేషన్ సాధించాలనే ఏకైక లక్ష్యం కోసం వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. వీఆర్‌పీఎస్ పోరాటాల ఫలితంగానే గత ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వాల్మీకుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడి బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేలా కృషి చేయాలన్నారు. వాల్మీకుల విజ్ఞప్తిని చంద్రబాబు విస్మరిస్తే త్వరలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామన్నారు. రాష్ట్ర నాయకులు బోయ శ్రీరాములు, నగర అధ్యక్షులు బోయ వెంకటనాయుడు, నాయకులు బోయ రాముడు, భూపాల్‌నాయుడు, సంజన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా పరిషత్ కార్యాలయం మినీ సమావేశ భవనంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. రామాయణాన్ని రచించి హిందూ ధర్మానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప ఆధ్యాత్మిక గురువుగా వాల్మీకి ప్రసిద్ధి చెందారన్నారు. ఎంపీడీఓ రాముడు, జెడ్పీ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సుభాష్, తదితరులు



వాల్మీకి చిత్రపటం వద్ద మున్సిపల్ ఉద్యోగులు



మట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి

కర్నూలు (టౌన్): రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలు పెంపొందించుకోవాలని నగరపాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి పూజలు చేశారు. అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, ఆర్ఓ స్వర్ణలత, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్‌బాషా, రామక్రిష్ణ, డీఎస్ఓ పాల్గొన్నారు.

కర్నూలు: ఏపీఎస్పీ రెండో పటాలం ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పోలీసు అధికారులు పూలమాలలు వేసి పూజలు చేశారు. డీఎస్పీ మహబూబ్ బాషాతో పాటు పలువురు పోలీసు అధికారులు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దన్న నాయుడు, సహాయ కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ లేకపోతే ఇంటికి పోండి

- పెద్దాసుపత్రిలో శానిటేషన్ సూపర్‌వైజర్లకు హుకుం

కర్నూలు(హాస్పిటల్): వారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను నమ్ముకుని 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇందులో కొందరు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ పనితీరు ఆధారంగా శానిటేషన్ సూపర్‌వైజర్లుగా ఎదిగారు. అప్పట్లో వీరిని ఏ ఒక్కరూ ఉన్నత చదువుల గురించి ఆరా తీయలేదు. మీరు చదువుకోలేదని విధులకు రావొద్దని చెప్పలేదు. కానీ ప్రస్తుతం ఆసుపత్రిలో పారిశుధ్య పనుల టెండర్ దక్కించుకున్న పద్మావతి సంస్థ శానిటేషన్ సూపర్‌వైజర్లకు కనీస విద్యార్హత డిగ్రీగా పేర్కొంటోంది. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో డిగ్రీ సర్టిఫికెట్ లేకపోతే ఉద్యోగం నుంచి సాగనంపుతోంది. ఇప్పటికే ఇద్దరిని ఈ మేరకు తొలగించింది. మరికొందరిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి, కర్నూలు మెడికల్ కాలేజీ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రస్తుతం 40 మందికి పైగా శానిటేషన్ సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. ఇందులో డిగ్రీ అర్హత ఉన్న వారు కేవలం 20మంది లోపే ఉన్నారు. మిగిలిన వారందరినీ ఉద్యోగం నుంచి తొలగించేందుకు ఆ సంస్థ ఆదేశాలు జారీ చేసింది. డిగ్రీ లేకపోతే విధులకు రావొద్దని ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే ఇద్దరిని విధుల నుంచి తొలగించింది. మిగిలిన 18 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిని నమ్ముకుని 10 నుంచి 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ఉన్నఫలంగా రోడ్డున పడేస్తే తామెలా జీవించాలని శానిటేషన్ సూపర్‌వైజర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుట్టుగా నియామకాలు చేపట్టేందుకు చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, నర్సింగ్ కాలేజీ, నర్సింగ్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న స్థానాల్లో పారిశుధ్య కార్మికులను నియమించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ మేరకు స్థానిక బుధవారపేటకు చెందిన కూటమి పార్టీకి చెందిన ఓ నాయకుడు ఆసుపత్రిలో కుర్చీని చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే 20 మంది వద్ద ఆ నాయకుడు ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో కూటమి పార్టీ నాయకుడు సైతం ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురు ఆశావహుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు చర్చ నడుస్తోంది. పారిశుధ్య కార్మికుల పోస్టులను ఆదాయ వనరుగా మార్చుకుని కూటమి పార్టీల నాయకులు ఆసుపత్రిలో చక్రం తిప్పాలని చూస్తున్నారు. కాగా పద్మావతి సంస్థ ప్రతినిధులు మాత్రం తాము ఇప్పటి వరకు ఎవరినీ తీసుకోలేదని చెబుతున్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు(సెంట్రల్): ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటనకు సంబంధించి నన్నూరు సమీపంలోని రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ, పార్కింగ్ ప్రదేశాలకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం, సాయంత్రం కలెక్టర్ రాగమయూరి గ్రీన్స్ హిల్స్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. వీవీఐపీలు, వీఐపీలకు గ్రీన్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని జేసీ డాక్టర్ బి.నవ్యను ఆదేశించారు. పబ్లిక్ మీటింగ్ వద్ద చేయాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను, ప్రధాని, ముఖ్యమంత్రి, ఇతర వీవీఐపీలకు కాన్వాయ్ వాహనాలను ఏర్పాటు చేయాలని డీటీసీ శాంతకు సూచించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్ఎం శ్రీనివాసులు, సేఫ్ రూమ్, స్పెషలిస్టు డాక్టర్లు, మెడికల్ టీమ్స్, అంబులెన్స్‌లపై తగిన శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్ఓ శాంతికళ, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు చెప్పారు. సభకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు, భోజనం వసతి, పారిశుద్ధ్య, హెలిప్యాడ్‌ల నిర్మాణం, విద్యుత్ సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్‌ఈడీ స్క్రీన్స్‌లు, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాట్లపై తదితర శాఖలు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు పార్కింగ్ కోసం 11 ప్రదేశాలు కేటాయించినట్లు చెప్పారు.

ఏర్పాట్ల పరిశీలన



భద్రత ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైలం, కర్నూలు రానున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. మంగళవారం ఓర్వకల్లు మండలం, నన్నూరు రాగమయూరిలో బహిరంగ సభ, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని నలుమూలల నుంచి వచ్చే రూట్లను స్వయంగా పరిశీలించి క్షేత్ర స్థాయి అధికారులకు ఎస్పీ పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రతపరమైన అంశాలు, ఇతర ఏర్పాట్లపై ఇతర శాఖల అధికారులతో కూలంకశంగా చర్చించారు. ప్రముఖులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున బహిరంగ సభకు హాజరయ్యే అవకాశమున్నందున తీసుకోవలసిన భద్రత చర్యలు, చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో లోటుపాట్లకు తావు లేకుండా సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎస్పీ వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇంటెలిజెన్స్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

అక్టోబర్ 16న జరిగే పీఎం ప్రోగ్రాంలో పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని పీఎం ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పీఎం విధులకు కేటాయించిన రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రవాణా శాఖ కసరత్తు

కర్నూలు: ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైలం, కర్నూలు పర్యటన నేపథ్యంలో వాహన ఏర్పాట్లపై రవాణా శాఖ కసరత్తు చేస్తోంది. బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు బస్సులను కూడా సమకూర్చాల్సి ఉన్నందున డీటీసీ శాంతకుమారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో ప్రాథమిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్‌టీఓ భరత్ చవాన్, ఎంవీఐలు మల్లికార్జున, నాగరాజు నాయక్, మధుసూదన్, రవీంద్ర కుమార్, సుధాకర్ రెడ్డి, శిశిర దీప్తి, ఏఎంవీఐలు బాబు కిషోర్, గణేష్ బాబు, ఏఓ వెంకటకుమార్‌తో పాటు పరిపాలన విభాగం సిబ్బందితో డీటీసీ సమావేశమై వాహనాల ఏర్పాటుపై చర్చించారు. జన సమీకరణకు 4,500 వాహనాలు, వీవీఐపీలకు దాదాపు 250 వాహనాలు అవసరమవుతున్నందున వాటి ఏర్పాటుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి కూడా వాహనాలను సమీకరించేందుకు చార్టు రూపొందించి ఎంవీఐల వారీగా బాధ్యతలను అప్పగించారు.

బోనమెత్తిన భక్తి



విన్యాసాలు ప్రదర్శిస్తున్న కళాకారులు



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం బుధవారపేట, కమ్మ వీధిలోని సుంకులమ్మ దేవాలయం ఆరవ జాతర అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. గత రెండు రోజులుగా జరుగుతున్న జాతరలో భాగంగా మంగళవారం వీధిలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో బీరప్ప డోళ్లు, డ్రమ్స్, మేళ తాళలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యాలు, చీర సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన బోనం రాకేష్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జాతర వైభవంగా సాగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు పప్పీ, సందడి సుధాకర్, కోదండరామయ్య, రవి, రామకృష్ణ గౌడ్, సందడి మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

కల్లూరు: అర్హులైన వారందరికీ ఇంటి స్థలం మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి రామ్మకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కల్లూరు అర్బన్ నేతలు, ఇంటి స్థలాల సాధన సమితి ఆధ్వర్యంలో రామచంద్రనగర్ వార్డు సచివాలయ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ప్రజలకు నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు నాగరాజు, రబీయా, నూర్జహాన్, మునెమ్మ, రాముడు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని ఖండించండి

కర్నూలు (సెంట్రల్): దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాదుల దాడిని ఖండించాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ సుభాన్, సభ్యులు పి.ఇక్బాల్ హుసేన్, ఎస్ఎండీ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మతోన్మాదులు బరితెగించి సుప్రీంకోర్టులో సాక్ష్యాత్తు భారత ప్రధాన న్యాయమూర్తిపై షూ విసిరేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఇది భారత దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తుందన్నారు.

జీఎస్టీపై అవగాహన

కల్లూరు: చిన్నటేకూరు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు.డీఈఓ శ్యామ్యూల్ పాల్, వాణిజ్య శాఖ అధికారులు హాజరై జీఎస్టీ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం డీఈఓ, ఎంఈఓ విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.

సీజేఐపై దాడికి ఖండన

కర్నూలు(సెంట్రల్): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ప్రమాదకరమని, ఇది రాజ్యాంగంపైనే దాడిగా పరిగణించవచ్చని సీఐటీయూ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎండీ ఆనంద్‌బాబు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రోజురోజుకు మతోన్మాదం రంగులు మార్చుకుంటోందని, సమాజంలో చీలికలు తెచ్చే కుట్రలో భాగంగానే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, ఎం.విజయ్, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు

దేశం తలదించుకునే ఘటన

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి దేశం తలదించుకునే ఘటన అని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పేర్కొన్నాయి. మంగళవారం సీజేఐపై దాడిని ఖండిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయిఉదయ్ మాట్లాడుతూ.. సనాతన ధర్మం పేరుతో ప్రజాస్వామ్యంపై దాడి చేయడం తగదన్నారు. నాయకులు హుస్సేన్‌బాషా, అంజి, ఆర్యన్, సాయి, యువరాజు, సందీప్, ప్రదీప్, విజయ్, న్యాయ విద్యార్థులు దివాకర్, ప్రశాంత్, శ్రీహరి, నిరంజన్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

కఠినంగా శిక్షించాలి

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డాక్టర్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన మతోన్మాద న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. న్యాయ చరిత్రలో ఇలాంటి ఘటన దురదృష్టకరమని చెప్పారు. మతాలు, కులాలతో సమాజాన్ని చీల్చే ప్రయత్నాలను ఖండించాలని కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ చెప్పారు.

ఉద్యోగం ఉందా.. ఊడిందా?



ఆర్‌యూ పరిపాలనా భవనం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆరుగురు టీచింగ్ ఫ్యాకల్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దసరా సెలవుల కంటే ముందు వర్సిటీ అధికారులు నిర్వహించిన అకడమిక్ పర్ఫార్మెన్స్ రివ్యూకు వీరు హాజరు కాకపోవడమే కారణంగా వర్సిటీ వర్గాలు అభిప్రాయడుతున్నాయి. ఆర్‌యూలో మొత్తం 33 మంది కాంట్రాక్ట్, నలుగురు మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) మొత్తం 37 మంది టీచింగ్ ఫ్యాకల్టీ ఉన్నారు. వర్సిటీ అధికారులు నిర్వహించిన అకడమిక్ పర్ఫార్మెన్స్ రివ్యూకు కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో 30, ఎంటీఎస్ ఉద్యోగుల్లో ఒకరు హాజరయ్యారు. ఈ 31 మంది టీచింగ్ ఫ్యాకల్టీ సర్వీసెస్‌ను 2025-2026 అకడమిక్ ఇయర్‌కు కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దాంతోపాటు 110 జీఓ ప్రకారం వీరి సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని జీతాలు పెంచి మరలా కొత్త ఆడర్ ఇచ్చారు. దీంతో గతంలో ఉన్న వీరి సర్వీస్ జీరో అవుతుందని రెగ్యులర్ సర్వీస్ పరిగణలోకి రాదనే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఈ 31 మందికి మాత్రమే సెప్టెంబర్ జీతం విడుదల చేయడంతో పాటు దసరా సెలవుల అనంతరం వర్సిటీ పునఃప్రారంభం కాగానే ఆయా విభాగాల్లోని హాజరు పట్టికల్లో వారి పేర్లు ఉన్నాయి. దీంతో పాటు వారికి మాత్రమే అకడమిక్ ఈవెంట్స్‌కు సంబంధించి కొన్ని బాధ్యతలు అప్పగించారు. మిగిలిన ఆరుగురికి గత నెల 25వ తేదీ వరకు వేతనం చెల్లించడంతో పాటు వారి డిపార్ట్‌మెంట్‌లలోని హాజరు పట్టికల్లో పేర్లు లేకపోవడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వారి ఉద్యోగాలు ఉన్నాయా..ఊడాయా? విధుల్లో ఉన్నారా.. లేరా? అనే గందరగోళం నెలకొంది.

ఉద్యమ బాట పట్టే ఆలోచనలో..

డాక్టర్ పి.నాగరాజు (ఎంబీఏ), డాక్టర్ ఎం.నాగభూషణ్ రెడ్డి (జువాలజీ), డాక్టర్ ఎం.వెంకట చంద్రుడు (జువాలజీ) టైంస్కేల్ ఉద్యోగులుగా ఉన్నారు. తాము న్యాయస్థానం ద్వారా ఎంటీఎస్ ఉద్యోగులుగా కొనసాగుతున్నామని, మళ్లీ అకడమిక్ పర్ఫార్మెన్స్ రివ్యూకు హాజరు కావాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతున్నారు. డాక్టర్ బి.సాయినాథ్ (ఓఆర్అండ్ఎస్‌క్యూసీ), డాక్టర్ యు.నాగిరెడ్డి (గణితం), డాక్టర్ ఎం.ఓబులేసు (తెలుగు) కాంట్రాక్ట్ ఉద్యోగులు. వీరు అకడమిక్ పర్ఫార్మెన్స్ రివ్యూకు హాజరు కాలేమని న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. 2010, 2018లో రెండు సార్లు గైడ్‌లైన్స్ విడుదల చేశారని అందులో ఎంట్రెంట్ టీచర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఆన్ కాంట్రాక్ట్ వారికి మాత్రమే వర్తిస్తుందని పేర్కొంటున్నారు. అయితే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తాజాగా యూజీసీ గైడ్‌లైన్స్ అంటూ అకడమిక్ పర్ఫార్మెన్స్ రివ్యూ నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందంటున్నారు. రాష్ట్రంలో సుమారు 17 యూనివర్సిటీలు ఉండగా కేవలం మూడు నాలుగు వర్సిటీలు మాత్రమే రివ్యూ నిర్వహించాయని, అందులో ఆర్‌యూ ఉందని పేర్కొంటున్నారు. యాప్సీ ఉత్తర్వుల్లో సైతం కొన్ని తప్పిదాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ ఆరుగురు టీచింగ్ ఫ్యాకల్టీ ఉద్యమ బాట పట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. బుధవారం వర్సిటీ ఉన్నతాధికారులకు నోటీసు అందజేయనున్నట్లు వారు చెబుతున్నారు.

వారికి మరో అవకాశం ఇస్తున్నాం

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు అకడమిక్ పర్ఫార్మెన్స్ రివ్యూ నిర్వహించాం. రివ్యూకు హాజరైన వారందరినీ కంటిన్యూ చేస్తున్నాం. రాని వారికి మరలా రివ్యూకు హాజరు కావాలని చెబుతున్నాం. రివ్యూకు హాజరైతే యథావిధిగా విధుల్లో కొనసాగుతారు. వర్సిటీలో విధులు నిర్వహించే వారు వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించాల్సిందే. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సాధ్యాసాధ్యాలు పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు, వీసీ, ఆర్‌యూ

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కర్నూలు(అర్బన్): తపాల వారోత్సవాల్లో భాగంగా కర్నూలు డివిజన్‌లోని ప్రజలకు ఆధార్ సేవలు అందించేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. 8, 9, 10 తేదీల్లో నగరంలోని బాలాజీనగర్ భాష్యం స్కూల్‌లో, 10, 11 తేదీల్లో ఎస్‌ఏపీ క్యాంప్ స్కూల్‌లో, 13, 14 తేదిల్లో సంకల్‌భాగ్‌లోని భాష్యం స్కూల్‌లో మొబైల్ ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరాల్లో పౌరులందరికీ ఆధార్ నమోదు, జనాభా సంబంధిత, బయోమెట్రిక్ అప్‌డేట్, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 5 - 7 సంవత్సరాలు, 15 - 17 సంవత్సరాల వారికి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు.

జీజీహెచ్ సీఎస్ఆర్ఎంఓగా పద్మజ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంఓ (సీఎస్ఆర్ఎంఓ)గా డాక్టర్ పి.పద్మజ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్ వైద్యులకు పదోన్నతులు నిర్వహించి పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న డాక్టర్ పి.పద్మజకు పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేశారు. కాగా గత కొన్ని నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఎస్‌పీఎంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటరమణ ఇన్‌చార్జ్‌గా నియమించారు. డాక్టర్ పి.పద్మజతో పాటు ప్రకాశం జిల్లా మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ కడియాల పద్మావతిని కర్నూలులోని ప్రాంతీయ శిక్షణా కేంద్రం (ఫిమేల్) ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎల్.తిరుపాలయ్యను కడప క్యాన్సర్ సెంటర్ సీఎస్ఆర్ఎంఓగా నియమించారు.